క్లుప్తంగా

మరోమారు వివాదంలో రాములకుంట చెరువు


రాములకుంట చెరువు

చిలుకూరు : మండలంలోని చెన్నారిగూడెం గ్రామ శివారులో గల రాములకుంట చెరువు వివాదం మరోసారి తెరమీదకు వచ్చింది. చెరువు తనదేనంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్లుగా చెరువులోని చేపలకు కోడి పెంటతో పాటు నూకలు వంటి వాటిని మేతగా వేస్తున్నాడు. దీంతో చెరువు నీరు దుర్వాసన వస్తున్నాయని గ్రామానికి చెందిన పలువురు 100కు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఐబీ అధికారులు ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఎన్నికల సమంలో ఈ విషయం గ్రామంలో చర్చానీయాంశంగా మారింది.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

చిలుకూరు : మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుంతరావులు సోమవారం విలేకరులకు తెలిపారు. అదేవిధంగా చిలుకూరులో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ కోదాడ నియోజకవర్గ అభ్యర్థి పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, జిల్లా, మండల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా ముస్తఫా


నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ ముస్తఫా నియమితులయ్యారు. సోమవారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గెల్లి రవి, కోతి సంపత్ రెడ్డి, అమరబోయిన సతీష్, యడ్ల విజయ్, భాస్కర్, గిరిబాబు, గడ్డం రాజశేఖర్, రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సీఈఓపై కేసు నమోదు

నడిగూడెం: మండల పరిధిలోని తెల్లబల్లి సహకార సంఘం రిటైర్డ్ సీఈఓ దేవబత్తిని శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు నడిగూడెం ఎస్ఐ ఏడుకొండలు సోమవారం తెలిపారు. తెల్లబల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కొల్లు ధనలక్ష్మి సహకార సంఘంలో రుణం తీసుకోకున్నా, తీసుకున్నట్లు బ్యాంకు నుంచి వడ్డీతో సహా చెల్లించాలని నోటీసులు రావడంతో ఆమె ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేతికొచ్చే దశలో పంటలు నేలపాలు


చిలుకూరులో నేలకొరిగిన వరి పొలం

చిలుకూరు : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చేతికొచ్చే దశలో ఉన్న వరిపొలాలు నేలకొరిగాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే దశలో దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు.

పాస్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని పాతర్లపహాడ్ వైకేబీపీఎం సెంట్రల్ చర్చిలో సోమవారం మండల పాస్టర్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ జి.శాంతయ్య, ఉపాధ్యక్షుడిగా బానోత్ సుధాకర్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ జలగం జేమ్స్, గౌరవ అధ్యక్షుడిగా టి.రవీందర్, జాయింట్ సెక్రెటరీగా పాస్టర్ టి.ప్రవీణ్, ట్రెజరర్‌గా డాక్టర్ పి.మార్కు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.కిరణ్‌బాబు, ఆర్గనైజర్‌గా ఎస్.యాకుబ్, గౌరవ సలహాదారులుగా వి.మత్తయి, బి.మోషేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ పీవీ బోయాజ్, పాస్టర్లు అన్వేష్, ప్రభు కుమార్, పాస్టర్ శ్రీకాంత్, డాక్టర్ నరసింహ , జీవన్, బాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

- కోదాడలో ఫార్వర్డ్ బ్లాక్, ధర్మసమాజ్ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు
- ఇండిపెండెంట్‌గా మరొకరు
- హుజూర్‌నగర్‌లో ఎంసీపీఐ (యూ) అభ్యర్థి


కోదాడ : నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంజియాదవ్


హుజూర్‌నగర్ : నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్న ఎం సీపీఐ (యూ) అభ్యర్థి సైదమ్మ

కోదాడ : కోదాడ అసెంబ్లీ స్థానానికి సోమవారం (మూడవ రోజు) ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంజియాదవ్ నామినేషన్ దాఖలు చేశాడు. అదేవిధంగా ధర్మ సమాజ్ పార్టీ నుంచి మెరిగ సైదిబాబు, ఇండిపెండెంట్‌గా జి. సుధాకర్‌రెడ్డిలు రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ ముందు తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు దాఖలైన నామినేషన్‌ల సంఖ్య ఆరుకు చేరుకుంది.

హుజూర్‌నగర్‌లో ఒకరు..

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం మొదటి నామినేషన్ దాఖలైంది. బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ (యూ) పార్టీ అభ్యర్థి వస్కుల సైదమ్మ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమె తన మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా ర్యాలీలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి నజీర్ మాట్లాడారు. కుళ్లు రాజకీయం అభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిదని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కులం, మతం, డబ్బు, మద్యం పేరుతో అనేక రకాల హామీలతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తారని ప్రజలు జాగ్రత్తగా గమనించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపూరి సోమన్న, చంద్రకళ, బాబు, సందీప్, భరత్, జ్యోతి, పద్మ, కలమ్మ, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

తేజ విద్యాలయంలో 'సాక్షి' స్పెల్‌బీ


స్పెల్‌బీ పరీక్షకు హాజరైన తేజ విద్యాలయ విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ కేఎల్‌ఆర్ కాలనీలో గల తేజ విద్యాలయం పాఠశాల విద్యార్థులు సోమవారం 'సాక్షి' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పోటీ పరీక్షలో పాల్గొన్నారు. ఆంగ్లభాష ప్రావీణ్యం కోసం 5 నుంచి 10వ తరగతి స్థాయిలో మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో కేటగిరి–2 లో సోనికా, ఆరాధ్య, కేటగిరి– 3లో భవజ్ఞ, శ్రీహన్విత, కేటగిరి– 4లో హరిణి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.

బీసీ ముఖ్యమంత్రి ప్రకటనను స్వాగతిస్తున్నాం

హుజూర్‌నగర్ : బీసీని ముఖ్యమంత్రి చేస్తామని బీజేపీ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు టికెట్స్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసం చేశాయని, ఆ రెండు పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీసీలను కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన మేళ్లచెరువు ఎంపీటీసీ

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ -1 సోమిరెడ్డి మంగమ్మ వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మరో పది కుటుంబాల వారితో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి, భిసవయ్య, సర్పంచ్ శంకర్‌రెడ్డి, రామాలింగారెడ్డి, సైదిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు


రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కోదాడరూరల్ : రైతులను తరుగు పేరుతో మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దని అఖిల పక్షం రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం పట్టణ పరిధిలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆ సంఘం కార్యవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మిల్లులకు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తీసుకొచ్చినప్పటికీ తేమ, తాలు, వేర్రిబ్జి వంటి కారణాలు చెప్తూ 5 కేజీల తరుగు తీస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 75 కెజీల బస్తాకు కేజీ మాత్రమే తరుగు తీయాలని, ట్రాక్టర్ ట్రక్కుల్లో బోరాలలో తీసుకొచ్చే ధాన్యానికి తరుగు తీయకుండా క్వింటాళ్ల చొప్పున లెక్కగట్టి నగదు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో వేర్రిబ్జిలు ఏర్పాటు చేసి రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అఖిల పక్షం రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్, దొడ్డా వెంకటయ్య, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, కొల్లు వెంకటేశ్వర్లు, ముత్యాలు, ఉదయగిరి, నరసింహారావు, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

మోతె : అమరవీరుల స్ఫూర్తితోనే నవ సమాజం కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు కసుకుంట్ల సైదులు అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మోతె మండలంలోని రావిపహాడ్‌లో న్యూడెమోక్రసీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కాకి మోహన్‌రెడ్డి, కోట మధుసుదన్‌రెడ్డి, ఎర్రబోయిన లింగయ్య, పొడపంగి ముత్తయ్య, పుల్లూరి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మార్పు వార్తలు అవాస్తవం

- జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్


రిట్నరింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్

సూర్యాపేట : బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ తెలిపారు. అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలతో కలిసి సోమవారం సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక కుట్రలు చేయడం హేయమైన చర్యని అన్నారు. ప్రాణం పోయినా బీఆర్ఎస్‌ను వీడేది లేదన్నారు. అనంతరం తప్పుడు పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఎంపీపీ మర్ల చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, పిల్లు, బైరు వెంకన్నగౌడ్, కక్కిరేణి నాగయ్య గౌడ్, పల్సా వెంకన్న, బొల్లె జానయ్య పాల్గొన్నారు.

బీజేపీలో యువకుల చేరిక

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణం, పాలకవీడు మండలానికి చెందిన 50 మంది యువకులు వివిధ పార్టీల నుంచి సోమవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ హుజూర్‌నగర్ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి కాషాయం కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో పాలకవీడు మండలం యువకులు శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, శ్రీను, శివ, నాగార్జున, నేరేడుచర్ల పట్టణానికి చెందిన గణేష్, మహేష్, యాకుబ్, సుదీర్, సంతోష్, వెంకట్, హుస్సేన్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొణతం నాగిరెడ్డి, సీనియర్ నాయకులు తాళ్లూరి రమేష్, రాంమ్మూర్తి, శంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్, నాగయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..


కరక్కాయలగూడెంలో బస్సును ప్రారంభిస్తున్న ప్రయాణికుడు షేక్ ఇమామ్, గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెం, బూరుగడ్డ మాచవరం గ్రామాలకు గత 10 నెలల క్రితం ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పల్లె వెలుగు సర్వీసులను పునరుద్ధరించాని సాక్షి దినపత్రికలో గత నెల 20వ తేదీన 'పల్లె వెలుగు జాడేదీ'అని వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కోదాడ ఆర్టీసీ డిపో అధికారులు ఎట్టకేలకు సోమవారం పల్లె వెలుగు బస్సును పునరుద్ధరించారు. దీంతో బూరుగడ్డకు ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కోదాడ నుంచి బయలుదేరిన పల్లె వెలుగు బస్సు చిలుకూరు మీదుగా కరక్కాయలగూడెం, మాచవరం, బూరుగడ్డ గ్రామాలకు చేరుకొని తిరిగి అదే దారిలో కోదాడకు చేరుకుంటుందని డిపో మేనేజర్ శ్రీహర్ష తెలిపారు. ఆయా గ్రామాల ప్రయాణికులు ఆర్టీసీ బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చాలా నెలల తరువాత బస్సు రావడంతో కరక్కాయలగూడెంలో గ్రామస్తుడు షేక్ ఇమామ్ కొబ్బరి కొట్టి బస్సును ప్రారంభించారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులు ఉన్నారు.

విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మునగాల : ఎస్సీ వర్గీకరణ సాధనకు హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించబోయే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రేపాలలో స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో కలిసి మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేరేల్లి బాబు, మండల ఇన్‌చార్జ్ లంజేపల్లి శ్రీను, నాయకులు చిర్రా వెంకన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుని నిత్యకల్యాణం


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతనపట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మొదలుపెట్టారు. ముందుగా విష్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను కమనీయంగా నిర్వహించారు. అనంతరం ఆలయ తిరుమాడ వీధుల్లో శ్రీస్వామి వారిని గరుడవాహనంపై ఊరేగించారు. తదనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీ, భక్తులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

అర్వపల్లి: పెంపకందారులు తప్పని సరిగా తమ జీవాలకు ఈ టీకాలను వేయించుకోవాలని పశువైద్యాధికారులు సూచించారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామంలో సోమవారం 400 గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ (పీపీఆర్) టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్ఓ కేఎస్ఎస్. పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి, పెంపకందారులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు


మఠంపల్లి : మాజీ ఎంపీపీ అంజమ్మను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల : బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలకు విసుగు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలను కప్పి పార్టీలో స్వాగతించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, పెండెం శ్రీనివాస్ గౌడ్, జ్యోతిబాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి రైతు సమన్వయ సమితి డైరెక్టర్

కోదాడ : బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ ఈదుల కృష్ణయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆదివారం రాత్రి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ కోదాడ అభ్యర్థి పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, యాదవ సంఘం నేతగా పేరున్న కృష్ణయ్య ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు సన్నిహితుడిగా ఉండేవారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు స్వగ్రామైన అనంతగిరికి చెందిన కృష్ణయ్య కోదాడలో స్థిరపడ్డాడు. 2018 ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గాన్ని సమన్వయం చేసి మల్లయ్య గెలుపునకు తాను ఎంతో కృషి చేశానని కానీ పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎంపీపీ

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మల్లికంటి అంజమ్మబుచ్చయ్య, మాజీ ఎంపీటీసీ జయమ్మ, రైతు సంఘం మండల మాజీ కోఆర్డినేటర్ హుస్సేన్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, నిజాముద్దీన్ డి.వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీలు నీలామంజీనాయక్, అరుణాసైదులు, స్రవంతి కిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చోక్లా, శ్రీను, ఎల్లారెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


ఎమ్మెల్యే సైదిరెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజుర్‌నగర్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగులు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షుడు పి.ఉపేందర్ ఆధ్వర్యంలో వేర్ హౌసింగ్ గోడౌన్ కార్మికులు, ఉద్యోగుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు సోమయ్య, వీరారెడ్డి, కేవీఎన్ మూర్తి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పెన్షనర్లు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోల్‌లో పాల్గొన్న విద్యార్థులు

మోతె : విద్యార్థులు రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని స్కూల్ కరస్పాండెంట్ జానివియా అన్నారు. సోమవారం మండల పరిధిలోని మామిళ్లగూడెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో సామాజిక, రాజకీయాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ మహమ్మద్ హజారుద్దీన్, ప్రిన్సిపాల్ సఫియా, డైరెక్టర్ సైదామియా, ఇన్‌చార్జ్‌లు జలాల్, చాంద్‌పాష, ఉపాధ్యాయులు నర్సయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రామానుజచార్యులు మృతి తీరని లోటు


రామానుజచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నిత్య సేవకుడు ముడుంబై రామానుజచార్యులు అని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్లలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ రామానుజచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో, లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిన వ్యక్తి రామానుజచార్యులు అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో లయన్స్ క్లబ్‌ను ముందుకు నడిపిస్తామన్నారు. రామానుజచార్యులు అకాల మరణం లయన్స్ క్లబ్‌కు తీరని లోటన్నారు. కార్యక్రమంలో క్లబ్ జెడ్‌సీ యడవల్లి సత్యనారాయణరెడ్డి, డీసీ బట్టు మధు, సీతారాంరెడ్డి, రాచకొండ అంజయ్య, రాచకొండ రామన్న, రంగారెడ్డి, సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, యూసుఫ్, సైదులు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం


నడిగూడెం పోలింగ్ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు

నడిగూడెం : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఇబ్బందులు లేకుండా నడిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో నూతనంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఓట్లు వేయడానికి వచ్చే ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అత్యవసరంగా వీటిని నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తెల్లబల్లి, రత్నవరం, సిరిపురం, చాకిరాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కూడా మరుగుదొడ్ల నిర్మిస్తే ఓటర్లకు సౌకర్యం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా నడిగూడెం బస్టాండ్


నడిగూడెంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

నడిగూడెం : పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది నడిగూడెం పరిస్థితి. మండల కేంద్రంలో దాతల సహకారంతో 60 ఏళ్ల కిందట బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. నాడు నిత్యం ప్రయాణికులతో కళకళలాడిన బస్టాండ్ గత పదేళ్లుగా నిరుపయోగంగా మారింది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు బస్టాండ్ ఆవరణ అక్రమణకు గురై, బస్టాండ్ ప్రాంతం ఇరుకుగా మారింది. దీంతో నిత్యం నడిగూడెం నుంచి కోదాడ, ఖమ్మం, సూర్యాపేటతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో ఉన్న షాపుల వద్ద గంటల తరబడి నిలబడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.